
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
ఆదివారం 7 జూలై 2024



బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి 8
ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి 8



చకచకా..

- వేగంగా ధరణి దరఖాస్తుల క్లియరెన్స్
- స్పెషల్ డ్రైవ్‌తో త్వరితగతిన పరిష్కారం
- జిల్లాలో 37,079 దరఖాస్తుల్లో 32,990 క్లియర్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సాంకేతిక సమస్యలు, ఇతరకారణాలతో ధరణి వెబ్‌సైట్‌లో పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. ప్రత్యేక డ్రైవ్‌తో ధరణి దరఖాస్తులకు మోక్షం కలుగుతోంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే భూ సమస్యల సమగ్ర పరిష్కారానికి ఆదేశాలు ఇస్తూ ధరణి పోర్టల్‌లోని సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. పరిష్కారాన్ని సులభతరం కూడా చేసింది. గతంలో కలెక్టర్ స్థాయిలోనే పరిష్కరించే అవకాశం ఉన్న క్రమంలో అధికార వికేంద్రీకరణ చేస్తూ మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలకు తహసీల్దార్, ఆర్డీవోలకు అధికారాలను ఇచ్చారు. ఇందుకోసం ధరణిలో లాగిన్ అవకాశాలు కల్పించారు. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాస్ పుస్తకాలు లేకుండా నాలా కన్వర్షన్, ప్రభుత్వం సేకరించిన భూముల్లో సమస్యలు, ఎన్ఆర్ఐలకు సంబంధించిన భూముల సమస్యలు, కోర్టు, కేసులు సర్వే నంబర్ల మిస్సింగ్, పరిష్కరించడానికి ఆర్డీవోకు అధికారాలు ఇచ్చారు. పట్టా, అసైన్డ్ భూముల విరాసత్, జీపీఏ అనుమతులు, స్పెషల్ ల్యాండ్ ఖాతాల విలీనం సమస్యలు తహసీల్దార్ స్థాయిలోనే జరగనున్నాయి, రెండు, మూడు ఖాతాల్లో నమోదై ఉండే భూములకు సంబంధించిన సమస్యలను కూడా తహసీల్దార్లు పరిష్కరిస్తున్నారు. పాస్ పుస్తకాలు లేకుండా వ్యవసాయేతర భూములుగా నమోదై ఉన్నవి, భూ సేకరణ సమస్యలు, కోర్టు కేసులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు ఇతర సమస్యలు ఆర్డీవో పరిష్కరిసే కలెక్టర్ స్థాయిలో యాజమాన్య హక్కుల బదిలీ, అసైన్డ్ భూములతోపాటు వారసత్వ బదిలీకి సంబంధించి పాస్ పుస్తకాలు లేనివి నిషేధిత భూములు, సెమీ అర్బన్ భూములు, కోర్టు కేసులు జిల్లా కలెక్టర్ పరిష్కరిస్తున్నారు. ధరణిలో ఆన్‌లైన్‌లో సమీక్షలు చేస్తూ డ్యాష్‌బోర్డ్ ద్వారా దరఖాస్తుల పెండింగ్ విషయాలపై దృష్టి సారిస్తున్నారు.

● జిల్లాలో వేగంగా పరిష్కారం

జిల్లాలో ధరణి పోర్టల్‌లో 37,079 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా 32,990 దరఖాస్తులను పరిష్కరించారు. రెండు రోజుల క్రితం వరకు పరిష్కరించిన దరఖాస్తుల్లో ఎన్ఆర్ఐ పీపీబీ దరఖాస్తులు 16, కోర్టు కేసులు 1461, కోర్టు కేసు పీపీబీ 360, డేటా కరెక్షన్ 3096, జీపీఏ 151, ప్రొబిడేడ్ ప్రాపర్టీ 3918, పీపీబీ, నాలా, హౌస్ సైట్స్ 31, ఖాతాల మెర్జింగ్ 129, ల్యాండ్ సమస్య గ్రీవెన్స్ 8884, నాలా పీపీబీ 756, పెండింగ్ మ్యూటేషన్ 6562, వారసత్వానికి సంబంధించి 7570 దరఖాస్తులు పరిష్కరించారు. 2952 దరఖాస్తులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. వేగంగా జరుగుతున్నా దరఖాస్తుల పరిశీలనతో భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నావారికి ఊరట లభిస్తోందని చెప్పుకోవచ్చు. వచ్చే దరఖాస్తుల్లో పాస్ పుస్తకాల తప్పులు, పీవోబీ, ఖాతా మిస్సింగ్‌లకు సంబంధించిన సమస్యలు కూడా ఎక్కువగా ఉన్నాయి.

● పీవోబీ సమస్యకు పరిష్కారం

జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణాలు జరిగిన సమయంలో ప్రొహిబిటేడ్ అండర్ బుక్ సమస్యలు ఎక్కువగా వచ్చాయి. పీవోబీ సమస్యలు ప్రత్యేక డ్రైవ్‌లో పరిష్కారం అవుతున్నాయి. మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కాలువల తవ్వకాల్లో రైతుల భూముల్లో కొద్దిశాతం భూమిని కోల్పోయి పరిహారం పొందినప్పటికీ పూర్తిగా భూమిని కోల్పోయినట్లుగానే పోర్టల్‌లో చూపిస్తున్నాయి. ఇలాంటి సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పట్టా భూములు సైతం నిషేధిత జాబితాలో చేరి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నిషేధిత భూముల కింద ఉన్న దరఖాస్తులు 4307 ఉండగా సవరణలకు సంబంధించి 4725, వారసత్వ మార్పు 8220, మ్యూటేషన్ 6809 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇందులో దాదాపు 95 శాతం ఇప్పటికే సమస్యలను పరిష్కరించారు. అధికారులు పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి వేగంగా పనులు చేస్తున్నారు.

ఏక కాలంలో రైతు రుణమాఫీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జులై 6: రైతు రుణ మాఫీ మాటకు కట్టుబడి ఉన్నామని, ఏక కాలంలో రైతు రుణ మాఫీకి క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలో శనివారం ఆయన మాట్లాడుతూ గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో ఏకకాలంలో రూ.68వేల కోట్ల రుణ మాఫీ చేశామని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకకాలంలో రూ.31 వేల కోట్ల రుణ మాఫీ చేస్తున్నామని అన్నారు. రైతు బంధును రైతు భరోసాగా పేరు మార్చామన్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసాను గుట్టలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు ఇచ్చారని, ఇప్పుడు నిజమైన రైతులకు మాత్రమే రైతు భరోసా అందిస్తామని అన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

10న మానాలలో మెగా వైద్య శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూలై 6: జిల్లాలోని రుద్రంగి మండలంలోని మానాల గ్రామంలో ఈ నెల 10న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వైద్యశిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రతిమ హాస్పిటల్ సౌజన్యంతో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



శైలజను అభినందిస్తున్న డీఈవో

వేములవాడ టౌన్, జూలై 6 : వేములవాడ మండలం రుద్రవరం జిల్లా పరిషత్ స్కూల్‌కు చెందిన పండుగ శైలజ అనే విద్యార్థిని బాసరలోని ఐఐఐటీకి ఎంపికైంది. ఐఐఐటీకి ఎంపికైన శైలజను జిల్లా విద్యాధికారి రమేష్ శనివారం కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని మధవీలత, ఉపాధ్యాయులు ఉమామహేష్, మాధవి, సుధాకర్ ఉన్నారు.

ఏజీపీలుగా శ్రీనివాస్, అనిల్‌కుమార్



కీసరి శ్రీనివాస్



అనిల్‌కుమార్

సిరిసిల్ల క్రైం, జూలై 6: జిల్లాలోని సిరిసిల్ల సీనియర్ సివిల్ కోర్టు, జూనియర్ సివిల్ కోర్టు, వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయ వాదులు(ఏజీపీ)గా కీసరి శ్రీనివాస్, పొత్తూరి అనిల్ కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఉత్తర్వులు జారీ చేయగా బాధ్యతలు చేపట్టారు. కోనరావుపేట మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కీసరి శ్రీనివాస్ 2015లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకొని తొమ్మిదేళ్లుగా సిరిసిల్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రికి చెందిన పొత్తూరి అనిల్‌కుమార్ 2006 బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకొని 18 సంవత్సరాలుగా వేములవాడ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. వారి నియామకంపై సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు దొర్నాల సంజీవరెడ్డి, గుడిసె సదానందం, కార్యదర్శులు వెంకట్, రజనీకాంత్‌లు, న్యాయ వాదులు హర్షం వ్యక్తం చేశారు.

పౌష్టికాహారంతో పిల్లల్లో ఎదుగుదల

ఎల్లారెడ్డిపేట, జూలై 6: పిల్లలకు పౌష్టికాహారం అందించినప్పుడే ఎదుగుదల ఉంటుందని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు సమతుల ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు వాణి, కిరణ్మయి, వీవో అధ్యక్షులు శ్రీజ, రేణుక, సిబ్బంది రాణి, కీర్తి, సౌమ్య, చందన, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పంట చేలల్లో వానరమూక

ఎల్లారెడ్డిపేట, జూలై 6: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కోతుల బెడద తీవ్రమైంది. ఇళ్లలోకి దూరడంతోపాటు పొలాల్లోకి చేరి పంటను ధ్వంసం చేస్తున్నాయి. వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తే ఎదురు దాడికి దిగుతున్నాయని ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాటుకు సిద్ధంగా ఉన్న వరిని నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని, కోతుల బెడద నుంచి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

నేతన్నల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 6 : జిల్లాలోని నేతన్నల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో శనివారం వస్త్ర పరిశ్రమల యజమానులు, ఆసాములు, కార్మికులతో చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సమస్యలతోపాటు కార్మికులకు ఉపాధి, భవిష్యత్ కార్యచరణపై కాటన్, పాలిస్టర్, సైజింగ్, డైయింగ్ కార్మిక సంఘాల నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వస్త్ర పరిశ్రమలకు విద్యుత్ సబ్సిడీ, పాత బకాయిల మాఫీ, బతుకమ్మ చీరల బకాయిల విడుదల, కామన్ ఫెసిలిటేషన్ సెంటర్, క్లాత్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ఆధునిక టెక్నాలజీపై యువతకు శిక్షణ, సబ్సిడీపై ఆధునిక పవర్‌లూం యంత్రాలు ఇవ్వాలని యజమానులు, ఆసాములు, కార్మిక సంఘాల నాయకుల కోరారు. సిరిసిల్లలో యారన్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని, బకాయిలు ఉన్న విద్యుత్ బిల్లులను మాఫీ చేయించడంతోపాటు కార్మికులకు ఉపాధిని కల్పించేందుకు నూతన వస్త్రాల ఉత్పత్తుల ఆర్డర్‌లను రాష్ట్ర ప్రభుత్వం అందించాలని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేత కార్మికుల సమస్యలపై చర్చించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కారిస్తామని త్వరలో మరో సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని అన్నారు. పరిశ్రమలను యాథావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో చేనేత జౌళిశాఖ ఆర్‌డీడీ రాఘవరావు, ఏడీ మిట్టకోల సాగర్, పరిశ్రమల యజమానులు, ఆసాములు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



హాజరైన యజమానులు, ఆసాములు, నాయకులు

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్క నాటుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

రుద్రంగి, జూలై 6: మొక్కలతోనే మానవ మనుగడని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలనిప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఫారెస్ట్ ఆధికారులతో కలిసి ప్రారంభించారు. మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు వన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని మొక్కలు నాటి అడవులను సంరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో బాలామణి, డీఆర్‌డీవో శేషాద్రి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, చెలుకల తిరుపతి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్, తర్రె లింగం, సిరికొండ రవి, ద్యావల రవి, స్వర్గం పరంధామ్, సూర యాదయ్య, గంధం మనోజ్, దర్న మల్లేశం, ఆర్మూర్ నర్సయ్య, పడాల శ్రీనివాస్, పూదరి మహిపాల్, ఎర్రం అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు వన మహోత్సవ కార్యక్రమం నిర్వహిం చారు. శనివారం తంగళ్లపల్లిలో రహదారికి ఇరువైపులా కళాశాల పరిసరాల్లో మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో మొక్కల ప్రాధాన్యం వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రజనీ, వైస్ ప్రిన్సిపాల్ సుధా సింధూ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాణిశ్రీ, వలంటీర్లు పాల్గొన్నారు.

దుమాలలో విష జ్వరాల విజృంభణ



జ్వరంతో చికిత్స పొందుతున్న బాధితుడు

ఎల్లారెడ్డిపేట, జూలై 6: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో పారిశుధ్య పడకేసింది. మురుగునీటితో కాలువలు నిండిపోయాయి. జనాలు జ్వరాల బారిన పడి మంచం పట్టారు. అధికారులు గ్రామం వైపు చూడడం లేదని గ్రామ స్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఏడుగురు నాలుగు రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విష జ్వరాలతో రక్త కణాలు తగ్గిపోయాయని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఇప్పటికైనా గ్రామంలో వైద్యాధికారులు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని మెరుగైన వైద్యం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

చివరి దశ పనులు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 16: అమ్మ ఆదర్శ పాఠశాల్లో చివరి దశ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, బడిబాట, స్కూల్ యూనిఫాం, పుస్తకాల పంపిణీపై జిల్లా విద్యా శాఖ అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో రమేష్ కుమార్ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన మరమ్మతు పనుల వివరాలను తెలిపారు. జిల్లాలో మొత్తం 511 పాఠశాలలు ఉన్నాయని, మొత్తం 283 పాఠశాలల్లో పనులు మొదలు పెట్టామని వివరించారు. 248 పాఠశాలల్లో మొత్తం మరమ్మతు పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. మిగతా 35 పాఠశాలల్లోని పనులు రానున్న వారం రోజుల్లో పూర్తి చేస్తామని ఆయా మండలాల్లో పనులు చేపట్టిన అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఒక జత యూనిఫాం పంపిణీ చేశామని, రెండో జత త్వరలో అందజేస్తామని, పుస్తకాలు, నోట్ బుక్స్‌ను అందజేశామని తెలిపారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ సమీక్షలో జడ్పీ సీఈవో ఉమారాణి, ఈడబ్ల్యూఐడీసీ ఈఈ అనిత సింగనాథ్, డీఈవో రమేష్ కుమార్, పీఆర్ ఈఈ సూర్య ప్రకాష్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, పలు ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నార

ధ్వంసమైన డ్రైనేజీ

- రాకపోకలకు వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారిలో ధ్వంసమైన డ్రైనేజీ

జమ్మికుంట, జూలై 6: జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా నుంచి పాత కూరగాయాల మార్కెట్ వెళ్లే ప్రధాన మార్గంలో డ్రైనేజీ పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు ఇరుకుగా మారడంతో అటువైపు వెళ్లే వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.. ఎఫ్‌సీఐ, నూతన వ్యవసాయ మార్కెట్, రైస్ మిల్లులకు ఈ రోడ్డు నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అధిక లోడుతో వచ్చే భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, వ్యవసాయ ఉత్పత్తులు తీసుకు వెళ్లే ట్రాలీలు, ఇసుక ట్రాక్టర్ల రాక పోకలతో రోడ్డు మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. వీటికి తోడు చికెన్ సెంటర్లు, ఎగ్ సెంటర్లు, కిరాణ షాపులు అటువైపు ఎక్కువగా ఉన్నాయి. కోరపల్లి, విలాసాగర్, బిజిగిరిషరీఫ్, పోతిరెడ్డిపల్లి, కొండపాక గ్రామాలకు ఈ ప్రాంతం నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. సాధారణంగానే కూరగాయాల మార్కెట్ రోడ్డు ఇరుకుగా ఉటుంది. దీనికితోడు కాల్వ ధ్వంసం కావడంతో రోడ్డు మరింత ఇరుకుగా మారింది. భారీ వాహనాలు వచ్చిన సమయంలో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి

- జూనియర్ సివిల్ జడ్జి పద్మ సాయిశ్రీ

హుజూరాబాద్, జూలై 6: విద్యార్థులు నేరాల వైపుకి వెళ్లకుండా చదువుపై దృష్టి పెట్టాలని హుజూరాబాద్ కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పద్మ సాయిశ్రీ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నూతన శిక్ష చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి పద్మ సాయిశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇటీవలే నూతనంగా వచ్చిన శిక్ష చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. యువత లక్ష్యం ఏర్పారుచుకొని సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల, మహిళ సాధికారత జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీలత, ఫైనాన్షియల్ లిట్రసి రోహిణి, సఖి లీగల్ కౌన్సిలర్ సంధ్యారాణి, కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డబుల్ రోడ్డు పనులు


గునుకుల కొండాపూర్ వరకు చేపడుతున్న రోడ్డు పనులు

గన్నేరువరం, జూలై 6: గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు 71 కోట్ల రూపాయలతో మంజూరైన డబుల్ రోడ్డు పనులు ఎట్టకేలకు కొన సాగుతున్నాయి. మొత్తం 21కిలోమీటర్ల మేర 33ఫీట్ల తారు రోడ్డు వేయనున్నారు. ప్రస్తుతం గునుకుల కొండాపూర్ వరకు వరకు రోడ్డు పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆర్ అండ్ బీ అధికారులు తెలిపారు. గన్నేరువరం మండలంగా ఏర్పాటు కాకముందు ఈ రో డ్డుపై వాహనాలు పెద్దగా వెళ్లేవి కావు. ప్రస్తుతం మండలంగా ఏర్పడ్డ గన్నేరువరం నుంచి వాహనాల రాకపోకలు పెరిగాయి. ఇటీవలి వరకు రోడ్డుపై గుంతలు ఉండడంతో వాహనదా రులు ఇబ్బందులు పడ్డారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు.

కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు

రామడుగు, జూలై 6: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై పోలీస్ స్టేసన్‌లో ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. పల్లె ప్రకృతి వనంలోని ఫెన్సింగ్‌ను తొలగించారని తెలిపారు. తిరిగి శనివారం గ్రామపంచాయతీ సిబ్బందితో కంచెను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నాటిన చోటే మళ్లీ గుంతలు

- మొక్కలు పెట్టి సంరక్షణ మరిచిన అధికారులు


చిగురుమామిడి గ్రామ శివారులో తీసిన గుంతలు

చిగురుమామిడి, జూలై 6: మండల వ్యాప్తంగా గత ప్రభుత్వం హయాంలో హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో మొక్కలు ఎండిపోయాయి. ఈ ఏడాది మళ్లీ ఆ ప్రాంతాల్లోనే మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తుండడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం శివారులో ఉన్న పామ్‌బండ వద్ద మాజీ సీఎం కేసీఆర్ ఎంతో అట్టహాసంగా హరితహారం కార్యక్రమంలో భాగంగా 2015 ఆగస్టులో మొక్కలు నాటారు. అధికారులు పట్టించుకోక పోవడంతో అన్ని మొక్కలు ఎండి పోయాయి. దీంతో లక్షలాది రూపాయలు ప్రజల సొమ్ము వృథా అయిందని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఏడాది మళ్లీ అధికారులు విధించిన లక్ష్యం చేరుకునేందుకు ఆ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 53,900 మొక్కలు నాటాల్సి ఉంది.. దీని కోసం అధికారులు ఉపాధి హామీ పథకం ద్వారా కూలీల చేత గుంతలు తీసి సిద్ధం చేస్తున్నారు. మొక్కలు నాటి సంరక్షణకు కంచేలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

ఐక్య ఉద్యమాలు నిర్వహించాలి

జమ్మికుంట, జూలై 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమ య్యాయి. ప్రిన్సిపాల్‌గా జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్ వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన వాసుదేవరెడ్డి మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం రోజు రోజుకు పెరిగిపోతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన మ్యాజిక్ ఫిగర్ రాలేదన్నారు. 400సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు సవరిస్తామని చెప్పిన మాటలను ప్రజలు తిరస్కరించి 240సీట్లకు పరిమితం చేశారని చెప్పారు.. ఎన్డీఏ పక్షాలను కలుపుకొని నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారని చెప్పారు. ఇది పూర్తి కాలం నిలబడే ప్రభుత్వం కాదన్నారు. బీజేపీ ఒంటెత్తు పోకడలను మిత్ర పక్షాలు భరించలేక ఏ క్షణంలో అయిన వైదొలిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం రద్దు చేయాలని, నేరుగా సింగరేణికి కేటాయించాలని కోరారు. ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం 200బొగ్గు బ్లాకులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందని తెలిపారు. సమావేశంలో వెలమరెడ్డి రాజిరెడ్డి, కొప్పుల శంకర్, బాసిర నందప్‌రావు, దండిగారి సతీష్, చెల్పూరి రాములు, వద్లూరి కిషోర్, రాజు, వసుదేవ్, రమేశ్, రాజకుమారి, మధునయ్య, వెంకన్న పాల్గొన్నారు.

సామాజిక శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి

జమ్మికుంట, జూలై 6: సామాజిక శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయాలని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సామాజిక శాస్త్రాల జ్ఞానశాస్త్రం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జ్ఞానం పుట్టుక, స్వభావం, పరిమితులు, వాస్తవాలు, విలువలకు మధ్య ఉండే వైరుధ్యాలు, సామాజిక శాస్త్రాల పాత్ర అంశాలపై వివరించారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఫ్రెంచ్ విప్లవం ద్వారా సమాజానికి పరిచయం అయ్యాయన్నారు. సామాజిక శాస్త్రాలు విలువలకు ప్రాధాన్యం ఇస్తే, సైన్స్ వాస్తావాలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇవి ఎప్పుడు మారుతుంటాయని, అందుకే సామాజిక శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయవల్సిన అవసరం ఉందని చెప్పారు.. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి రాజశేఖర్, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ రామమోహన్‌రావు, అధ్యాపకులు బి మహేందర్‌రావు, డాక్టర్ టి శ్రీలత, పిడి సుజాత, ఆర్ ఈశ్వరయ్య, వి స్వరూపరాణి, పి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్ రవిందర్, డాక్టర్ రవి ప్రకాష్, డాక్టర్ సుష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

హుజూరాబాద్‌రూరల్, జూలై 6: అధ్యాపకులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయాలని ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ వేణు వినోద్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అధ్యక్షతన క్వాలిటి ఎం హాన్సమెంట్ ఇన్ టెక్నికల్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి అవసరమైన ప్రయోగాలు చేసేలా అధ్యాపకులు తర్ఫీదులు చేయాలన్నారు. శాస్త్రీయ సాంకేతిక జర్నల్స్‌లో మంచి నాణ్యమైన పరిశోధన పత్రాలు సమర్పించాలని, అప్పుడే మాత్రమే విద్యార్థులకు సరైన ఆదునిక పరిజ్ఞానం అందు ుందన్నారు. ప్రశ్నపత్రం తయారిలో, మూల్యాం కనంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసి డీన్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.వి సతీష్‌కుమార్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వేణుగోపాల్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

జమ్మికుంట రూరల్, జూలై 6: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి విష్ణు అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సందర్శించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న బోజనం పథకానికి నిధులు కేటాయించి విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందజేయాలన్నారు. ఉపాధ్యాయ, అటెండర్, స్కావెంజర్, పీటీ, టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఇల్లందుల శ్రీనాథ్, మొలుగూరి వినయ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు

- వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థుల వినతి

చిగురుమామిడి, జూలై 6: మండలంలోని 17 గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతీ రోజు సుమారు 80 నుంచి 90 మంది వరకు రోగులు చికిత్స కోసం వస్తు న్న పరిస్థితి నెలకొంది. పలు గ్రామల్లో ప్రజలు దగ్గు, జ్వరం, జలుబుతో ఇబ్బందులు పడు తున్నారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఎలాంటి పరీక్షలు చేయకుండా సిబ్బంది కేవలం మందులు ఇస్తూ సరిపెడుతున్నారని పలువురు వాపోయారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి..

వైద్యాధికారులు సీజనల్ వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అన్ని గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. రోగులకు సరిపడా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వ అదేశాల మేరకు వైద్య సిబ్బంది ఆస్పత్రిలో ఉండి చికిత్స అందించాలి.

- సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి

ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,జూలై 6: ఎస్‌యూ పరిధిలోని ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను పరీక్షల నియంత్రాణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీ రంగప్రసాద్ శనివారం విడుదల చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాలను www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో సందర్శించాలని సూచించారు.

రూ. 31.81లక్షల సైబర్ మోసం

సిరిసిల్ల క్రైం, జూలై 6: జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో రూ. 31.81లక్షలు సైబర్ మోసానికి గురైనట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం తెలిపారు. జిల్లా ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబరు 1930కి ఫోన్‌చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిరిసిల్లలో క్రిప్టో కరెన్సీ, ట్రేడింగ్ పేరిట రూ.2.62లక్షలు, వేములవాడ టౌన్‌లోనూ ట్రేడింగ్ పేరిట రూ.28.75లక్షలు, ముస్తాబాద్‌లో ద్విచక్రవాహనం తక్కువ ధరకే ఇస్తామని నమ్మించి రూ.44, 500 కాజేశారని వివరించారు. ప్రజలు మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

గోదావరిఖనిలో పోలీసుల తనిఖీలు

● మత్తు పదార్థాల కట్టడికి నార్కోటిక్ శిక్షణ డాగ్స్ వినియోగం

కోల్‌సిటీ, జూలై 6: గోదావరిఖని ఇందిరానగర్‌లో శనివారం తెల్లవారుజామున వన్‌టౌన్ పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిం చారు. ఏసీపీ ఎంరమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది కాలనీలోని ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మొదటి సారిగా నార్కోటిక్ డాగ్స్‌ను వినియోగించారు. మత్తు పదార్థాలు, గంజాయి వంటి జాడ తెలుసుకునేందుకు వీటిని వినియోగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని, కొత్త వ్యక్తులు, నేరస్థులు కాలనీల్లో షెల్టర్ తీసుకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్‌కాల్స్, మెసేజ్, వాట్సాప్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఏమైనా



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, 100నెంబర్‌కు కాల్ చేసి చెప్పాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించి గృహపత్రాలు కలిగి ఉండాలని, స్వీయ రక్షణ కోసం హెల్మెట్లు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్-2 ఇన్‌స్పెక్టర్ లింగమూర్తి, ఎస్ఐలు సమ్మయ్య, శ్రీనివాస్, సుగుణాకర్, గోదావరిఖని టుటౌన్ ఎస్ఐలు సనత్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

అన్నదమ్ముల ఆస్తి తగాదా

● తల్లిని రోడ్డుకు ఈడ్చిన కొడుకులు



సామగ్రితో ఇంటిబయట తల్లి శకుంతల

సిరిసిల్ల టౌన్, జూలై 6: సొంత అన్నదమ్ముల ఆస్తి తగాదా తొమ్మిది నెలలు మోసి కని పెంచిన తల్లిని రోడ్డున పడేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకున్న సంఘటన స్థానికులను కలిచివేసింది. బాధితురాలి కథనం ప్రకా రం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన యెలిగేటి శకుంతల లక్ష్మీనారాయణ దంపతులకు ముగ్గురు కొడుకులు దామోదర్, రామానుజం, చంద్రశేఖర్. అష్టకష్టాలు పడి పెంచారు. భర్త లక్ష్మీనారాయణ రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించాడు. అనంతరం పెద్ద మనుషుల సమక్షంలో ఉన్న ఇంటిని ముగ్గురు కొడుకులకు మూడు భాగాలు చేసి అందులోనే ఒక గదిలో శంకుతల ఒంటరిగా ఉంటోంది. ముగ్గురు కొడుకుల్లో రెండో కుమారుడు రామానుజం వ్యాపారంలో నష్టం రావడంతో ఇంటిలోని తన భాగాన్ని ఇద్దరు సోదరులకు ధర కట్టి ఇచ్చాడు. కొన్ని డబ్బులు ఇవ్వడంతో అప్పులు కట్టుకొని వేరే ప్రాంతంలో అద్దెకు ఉంటున్నాడు. రెండో కుమారుడు రామానుజంకు మొత్తం డబ్బులు రాకపోవడంతో ఇంటిని రిజిస్ట్రేషన్ చేయలేదు. రామానుజంకు చెప్పి రిజిస్ట్రేషన్ చేయించాలని తల్లి శకుంతలను పెద్ద కొడుకు దామోదరం, చిన్న కొడుకు చంద్రశేఖర్ ఏడు నెలల క్రితం బలవంతంగా ఖాళీ చేయించారు. దీంతో శకుంతల అక్కడే ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంది. ఇటీవల శకుంతల అస్వస్థతకు గురవడంతో ఇంటి యజమానులు ఖాళీ చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో తన సొంత ఇంట్లోనే ఉంటానని సామగ్రితో శనివారం తిరిగి వచ్చింది. ఇద్దరు కొడుకులు ఇంట్లోకి రాకుండా ఇంటికి తాళం వేయడంతో ఆ తల్లి సామగ్రితో సహా నిరీక్షించింది. పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

సింగరేణిలో 272పోస్టులకు ప్రత్యక్ష నియామకాలు

● ఈ నెల 20, 21తేదీల్లో రాత పరీక్ష

గోదావరిఖని, జూలై 6: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో ఆయా విభాగాలలో ఖాళీగా ఉన్న 10కేటగిరీలలో గల 272పోస్టులకు ఈ నెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎఫ్ఏ), మేనేజ్‌మెంట్ ట్రైనీ(పర్సనల్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఐఈ), జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ(హైడ్రో జియాలజిస్ట్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(సివిల్), జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, సబ్ ఓవర్సీస్ ట్రైనీ పోస్టులను ప్రత్యక్ష నియామకాల (ఎక్స్‌టర్నల్) పద్ధతిలో భర్తీ చేయడానికి ఎంప్లాయ్‌మెంట్ నోటిఫికేషన్ నెంబర్ 01/2024 ప్రకారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 20,21తేదీల్లో హైదరాబాద్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది. అభ్యర్థులు సింగరేణి సంస్థ వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డ్/హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, అభ్యర్థుల మెయిల్ ఐడికి కూడా డౌన్లోడ్ చేసుకోవటానికి లింక్ పంపించడం జరిగిందని యాజమాన్యం తెలిపింది. పరీక్ష తేదీ, సమయం, సెంటర్ పేరు హాల్ టికెట్ నందు పోస్టులవారీగా పొందుపరిచామని జీఎం(సెక్యూరిటీ), జీఎం(పర్సనల్) వెల్ఫేర్ , ఆర్‌సీ బీఆర్ దీక్షితులు తెలిపారు. పోస్టులన్నీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ద్వారా పూర్తిగా మెరిట్‌పై ఆధారపడి ఉంటుందని, దళారులను నమ్మి ఎవరూ మోస పోవద్దని, ఎవరైనా సామాజిక మాధ్యమాలలో మెసేజ్, ఫోన్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే ప్రలోభాలకు గురికాకుండా సింగరేణి విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌కు తెలియజేయాలన్నారు. అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం పేర్కొన్నారని వారు తెలిపారు.

కుక్క దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 6: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో శనివారం కుక్క దాడిలో అదే గ్రామానికి చెందిన ఇల్లెందుల రాజిరెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజిరెడ్డి తన ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో రోడ్డుపై ఉన్న కుక్క వెంబడించి గాయపరిచింది. గ్రామంలో ఇటీవల కుక్కల బెడద అధికమైందని ప్రజలు పేర్కొంటున్నారు. పది రోజుల కిందట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న ఐదుగురు విద్యార్థులపై దాడి చేశాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్ఆర్ఎస్‌పీ ప్రాజెక్టులోకి 1,736 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యంకు ప్రస్తుతం 11.545 టీఎంసీల నీరు నిల్వఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.405 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.840 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

భూవివాదంలో యువకుడి ఆత్మహత్య

ఓదెల, జూలై 6: మండలంలోని జీలకుంటలో వంగల శ్రీకాంత్‌రెడ్డి(36) అనే యువకుడు శనివారం తన ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని గ్రామస్థులు తెలిపారు. రెండేళ్ల క్రితం శ్రీకాంత్‌రెడ్డి భూమి విషయమై వివాదం ఏర్పడిందని, అప్పటి నుంచి తన భూమి తనకు దక్కుతుందో, లేదో అనే మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఆత్మహత్య విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఒకరిపై దాడి ఘటనలో ఇద్దరి అరెస్టు

చందుర్తి, జూలై 6 : ఒకరిపై దాడి చేసిన సంఘటనలో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ శనివారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం మండలంలోని లింగంపేట గ్రామంలో మల్యాల రవిపై జూన్ 27న ఇదే గ్రామానికి చెందిన మంద గణేష్, కట్కూరి అక్షయ్ లు బీరు సీసా, కర్రలతో దాడికి పాల్పడ్డారు. రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, అరెస్టు చేసి గణేష్, అక్షయ్‌లను రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 6: సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న చిత్తారి రత్నం(52) నోటి నుంచి నురుగులు కక్కుతుండగా శుక్రవారం రాత్రి 11 గంటలకు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మృతి చెందాడని మూడో టౌన్ పోలీసులు తెలిపారు. శంకరపట్నం మండలం గద్దెపాకకు చెందిన రత్నం సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటూ విద్యుత్‌స్థంభాల సబ్‌కాంట్రాక్టు పనిచేస్తుంటాడని పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హోటల్స్, రెస్టారెంట్లలో విస్తృత తనిఖీలు



బేకరీలో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు హోటల్స్ రెస్టారెంట్లు, ప్రభుత్వ, ప్రయివేటు వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో శనివారం ఆహార కల్తీ నిరోదక అధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు. సీడ్ పాయింట్, పబ్ రెస్టారెంట్, సుప్రబాత్ రెస్టారెంట్ తదితర రెస్టారెంట్లు, హోటల్స్‌లలో శాంపిల్స్ సేకరించారు. పట్టణ శివారు ప్రాంతంలోని నూకపల్లి వద్ద కన్నయ్య డాల్ అను వ్యక్తి నిర్వహిస్తున్న బాంబే బేకరీలో తనిఖీలు చేశారు. బేకరీలో నిబంధనలకు విరుద్ధంగా రస్క్, ఫ్యామిలీ బిస్కట్, కేక్‌లను తయారీ చేస్తున్నట్లుగా గుర్తించారు. బేకరీపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష మాట్లాడుతూ పలు రెస్టారెంట్లు, హోటల్స్‌లలో తనిఖీలు చేసి శాంపిల్స్‌ను సేకరించామని, సంబంధిత శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపడం జరుగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

క్షౌరశాలలకు 250 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి

గణేశ్‌నగర్,జూలై 6: క్షౌరశాలలకు గత ప్రభుత్వం 250 యూనిట్ల కరెంటు సబ్సిడీ ఇచ్చిందని దానిని కొనసాగించేలా చూడాలని జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం టీజీ ఎన్‌పిడిసిఎల్ ఎస్ఈ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘనాయకులు మాట్లాడుతూ కరీంగగర్ జిల్లాలో సుమారు 2500 వరకు సెలూన్ షాపులు ఉన్నాయన్నారు. నాయీ బ్రాహ్మణ సెలూన్లకు, రజకులకు కూడా గత ప్రభుత్వం మాదిరిగానే సబ్సిడీ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కరెంటు సిబ్బంది సెలూన్ల బిల్లు కట్టాలని లేకుంటే విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సబ్సిడీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మా సమస్యను పరిష్కరించాలని కోరారు. విద్యుత్ సిబ్బంది నాయీబ్రాహ్మణులను, రజకులను విద్యుత్ బిల్లులు చెల్లించాలని వేధించకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నీలం మొండయ్య నాయీ,జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల జయరాం నాయీ, నగర అధ్యక్షులు జంపాల సంపత్ నాయి,నగర ప్రధాన కార్యదర్శి కంది వెంకటేష్ నాయీ, సంఘం సభ్యులు తదితారులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులపై టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

శంకరపట్నం, జూలై 6: శంకరపట్నం మండలంలోని తాడికల్ శివారులో గల రాజరాజేశ్వరి రైస్ మిల్లుపై శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 2022-23 రబీ సీజన్, 2023-24 ఖరీఫ్ సీజన్, రబీ సీజన్‌లకు సంబంధించిన 3.24లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని తనిఖీ చేశారు. 673 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. నెల రోజులలో 673 క్వింటాళ్ల ధాన్యం సీఎంఆర్ ఇవ్వాలని యాజమాన్యాన్ని ఆదేశించి , వారి వద్ద నుంచి అండర్ టేకింగ్ లెటర్ తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు లక్ష్మారెడ్డి, జగిత్యాల డీఎం అర్జిరామ్, నయాబ్ తహసీల్దార్ రమేష్‌బాబు, ఏఎస్ఐ సుధాకర్, సివిల్ సప్లై అసిస్టెంట్ మేనేజర్ శ్రీనునాయక్, డీటీసీ వేణు తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, జూలై 6: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భారీగా తరలివచ్చిన భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

నరసింహుని సన్నిధిలో జిల్లా అడిషనల్ జడ్జి పూజలు

నరసింహస్వామి దేవాలయాన్ని జిల్లా అడిషనల్ జడ్జి నారాయణ శనివారం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ జడ్జికి స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు బహూకరించి ఆయనను సత్కరించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆయన వెంట ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఆలయ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు అశ్విన్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు పాల్గొన్నారు.

కళాభారతి.. ఏమిటీ పరిస్థితి

● శిథిలావస్థకు చేరుతున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కళాభారతి పక్కన చెత్తా చెదారం



అసంపూర్తిగా మినీ ఆడిటోరియం

కరీంనగర్ కల్చరల్, జూలై 6: ఘన చరిత్ర ఉన్న కళాభారతి నేడు అధ్వాన స్థితికి చేరింది. ఊడిన పై కప్పు పెచ్చులు... విరిగిన కుర్చీలు.. కుంగిన వేదిక.. చెత్తా చెదారంతో అక్కరకురాని వస్తువులకు నిలయంగా మారింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ తొలిసారి కరీంనగర్ వచ్చినప్పుడు అన్ని హంగులతో కలెక్టరేట్ హెలీప్యాడ్ ఆవరణలో పెద్ద ఆడిటోరియం నిర్మిస్తామని చెప్పారు. తొలి విడతగా రూ.15 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదలయ్యింది. టెండర్లకు ఆహ్వానించకపోవడంతో అటు పాత కళాభారతికి మోక్షం దక్కక, కొత్త ఆడిటోరియం నిర్మాణ పనులు మొదలుకాలేదు. 2005లో ఎస్సారార్ కళాశాల ఆవరణలో కళాభారతికి ప్రత్యామ్నాయంగా నిర్మించతలపెట్టిన మినీ రవీంద్రభారతి కలగానే మిగిలిపోయింది.

● ఇదీ చరిత్ర...

1974లో కళాభారతిని నిర్మించారు. అప్పుడు టౌన్‌హాల్‌గా పిలిచేవారు. 1978లో కలెక్టర్‌గా ఉన్న కేఎస్ శర్మ కళాభారతి అని పేరు పెట్టారు. అనంతరం వెనుక భాగంలో ఆడిటోరియం నిర్మించారు. 2005లో మినీ రవీంద్ర భారతిగా అప్‌గ్రేడ్ చేసేందుకు సెంట్రల్ స్కీం కింద రెండు కోట్ల నిధులు కేటాయించారు. తొలి విడత 25 లక్షలు ఇవ్వగానే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. తర్వాత నిధులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. ఈటల రాజేందర్, గంగుల కమలాకర్ మంచి కళాక్షేత్రం కోసం అప్పటి సీఎంతో మాట్లాడుతామని అన్నారు. అది సాకారం కాలేదు. క్రమక్రమంగా కళాభారతి శిథిలావస్థకు చేరుకుంది.



కరీంనగర్‌లోని కళాభారతి



నిరుపయోగంగా మారిన కళాభారతి

చెట్లు నరికిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మెట్‌పల్లి రూరల్, జూలై, 6 : మండలంలోని వేంపేట శివారులో గుర్తు తెలియని రైతులు విచక్షణారహితంగా చెట్లను నరికివేయడంతో మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో కార్యదర్శి ఫిర్యాదు చేశాడు. గ్రామ శివారులో ఉపాధిహమీ పథకంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన 150 చెట్లను ఈనెల 1న గుర్తు తెలియని రైతులు నరికివేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చెట్లు విచక్షణారహితంగా నరికివేసినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవోలు వ్యవహరించిన తీరుపై జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు మండలంలో చర్చించుకుంటున్నారు. చెట్లు నరికిన విషయంపై సాకులు చెప్పి దాటవేయడం మంచి పద్ధతి కాదని, ప్రభుత్వ అధికారులు జవాబుదారీ తనంగా వ్యవహరించాలని సూచించి చెట్లు నరికి వేసిన వారిపై ఫిర్యాదు చేయాలని హెచ్చరించినట్లు సమాచారం. కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యదర్శి మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హరితహారం పథకం కోసం ప్రతియేటా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో నాటిన మొక్కలు గొడ్డలి వేటుకు గురువుతున్నాయి.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



లవంగ భావన

మెట్‌పల్లి రూరల్, జూలై, 6 : మండలంలోని బండలింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో లవంగ భావన అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మరిపెల్లి కార్తీక్ శనివారం తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ అండర్ 12లో 100 మీటర్ల పరుగు పందెంలో భావన ప్రథమ బహుమతి గెలుపొంది మొదటి స్థానంలో నిలించింది. హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు నిర్వాహకులు మొదటి స్థానంలో నిలిచిన లవంగ భావనను ఎంపిక చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన భావనను ప్రధానోపాధ్యాయుడు జితేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినం దించారు. పాఠశాల పేరు నిలపాలని భావనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగుల పట్ల అధికార యంత్రాంగం సానుకూలంగా ఉండాలి

● గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

జగిత్యాల అర్బన్, జూలై 6 : జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల అధికార యంత్రాంగం సానుకూలంగా వ్యవహరించాల్సిన అవసరముందని గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్ కోరారు. శనివారం పట్టణంలోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని, గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన వారికి ఒక మాసం వేతనం ఇవ్వాలని, అపరిష్కృతంగా ఉన్న అయిదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల బదిలీపై వెళ్లిన అధికారులను యథాస్థానానికి బదిలీ చేయాలని, సమాన నిష్పత్తి చందాతో ఆరోగ్య పథకం అమలు చేయాలని కోరారు. పీఆర్‌సీ కాలయాపన జరుగుతున్నందున అయిదు శాతం ఐఆర్‌ను ఇరవై శాతానికి పెంచాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ ప్రవేశపెట్టాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రమేశ్, నాయకులు కందుకూరి రవి బాబు, గణేష్, బద్దం రాజేందర్ రెడ్డి, అత్తినేని శ్రీనివాస్, నలీం, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ అంజిత్ రెడ్డి, విజేందర్, ఎ. శ్రీనివాస్, డాక్టర్ రాజేందర్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 6: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 25 మంది వాహనదారులను శనివారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 7 రోజులు, ఇద్దరు వ్యక్తులకు 3 రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు. మిగతా 22 మంది వాహనదారులకు 33,500 రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు పాటించి వాహనదారులు అన్ని ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు.

కూలిన కాకతీయ కాల్వ రక్షణ గోడలు

● మరమ్మతులు చేపట్టని అధికారులు

● భయాందోళనలో వాహనదారులు

మానకొండూర్, జూలై 6: కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారిపై మండలంలోని పోచంపల్లి గ్రామ శివారులో కాకతీయ కాల్వ వంతెన రక్షణ గోడలు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు మరమ్మతులు చేపట్టం లేదు. దీంతో వాహనదారులు భయాందోళనతో రాకపోకలు సాగిస్తున్నారు. కరీంనగర్ నుంచి జమ్మికుంట 45 కిలోమీటర్లు నిత్యం ఆర్టీసీ బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, పెద్ద సంఖ్యలో ద్విచక్రవాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి రోజూ కరీంనగర్ నుంచి జమ్మికుంటకు, ఊటూర్‌కు ప్రతి అరగంటకు ఒక్క బస్సు చొప్పున ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కాగా డీబీఎం-6 ప్రధాన కాల్వ వంతెన రక్షణ గోడలు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. గతంలో కాల్వ వంతెనపై ఇసుక లారీ వెళ్తున్న సమయంలో వంతెన కుంగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ తాత్కాలిక మరమ్మతులు



పోచంపల్లి వద్ద ప్రధాన రహదారిపై కూలిన కాలువ రక్షణ గోడ

చేపట్టి చేతులు దులుపుకున్నారు. రాత్రి వేళల్లో వంతెన మీదుగా వెళుతున్న ద్విచక్రవాహనదారులు కాల్వలో పడిపోతామోనని భయాందోళనలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలి



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 6 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడ జంక్షన్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్ర హాన్ని ఏర్పాటుచేయాలని అంబేద్కర్ సంఘం జిల్లా అధ్య క్షుడు కత్తెర దేవదాస్ కోరారు. శనివారం తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబే ద్కర్ సంఘం నాయకులు కొలూరి ధర్మేందర్, తుంగ శివరాజ్, సెస్ డైరెక్టర్ సుధాకర్, బిజిగ కిష్టయ్య, సిరిగిరి దేవయ్య, గడ్డం హన్మాంతు, రాగుల రాములు తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో బంజారాలకు చోటు కల్పించాలి



మాట్లాడుతున్న బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్

సిరిసిల్ల టౌన్, జూలై 6: రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో బంజారాలకు చోటు కల్పించాలని బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేష్‌నాయక్ కోరారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బంజారాల ఐక్యతను చాటుతూ ఏటా జిల్లా వ్యాప్తంగా ఒకేరోజు సీత్లా భవానీ వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 9న సీత్లా భవానీ వేడుకలను ఐక్యంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బంజారాలు సంపూర్ణ మద్దతు ఇచ్చారన్నారు. సమావేశంలో బంజారా సంఘం జిల్లా నాయకులు రాజు నాయక్, సీతానాయక్, ప్రభుత నాయక్, కళ్యాణనాయక్, దేవయ్యనాయక్, రామునాయక్, రమేష్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం



మాట్లాడుతున్న మోతె రాజిరెడ్డి

సిరిసిల్ల టౌన్, జూలై 6: రానున్న రోజులలో తెలంగాణలో టీడీపీ పుంజుకుటుందని టీఎస్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మోతె రాజిరెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. టీడీపీ తెలంగాణలో ప్రత్యక్ష రాజకీయాలలో ముఖ్యపాత్ర పోషించే సమయం వచ్చిందన్నారు. ఆదివారం హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటు న్నారన్నారు. సభకు జిల్లా నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆరే మల్లేశం, తుమ్మన్నపెల్లి సత్యం, బైరగోని ప్రవీన్‌గౌడ్, తిరుపతి పాల్గొన్నారు.

జనావాసాల్లోకి మయూరం

ఎల్లారెడ్డిపేట, జూలై 6: జాతీయ పక్షి నెమలి జనావాసాల్లోకి రావడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని 11వ వార్డులో నెమలి అటూ ఇటూ సంచరించడం చూపరులను కనువిందు చేసింది. మయూరాన్ని చూసిన జనం, పిల్లలు ఆనందంతో కేరింతలు కొట్టారు.

ఘనంగా మెహందీ వేడుకలు

వేములవాడ కల్చరల్, జూలై 6: వేములవాడ పట్టణంలోని బచ్‌పన్ స్కూల్‌లో శనివారం మెహందీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశా లలోని విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పలు ఆకృతులతో కూడిన మెహందీ చేతిలో వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అనిల్‌కుమార్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సుద్దాల ముదిరాజ్ యూత్ కార్యవర్గం

కోనరావుపేట, జూలై 7 : కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ ముదిరాజు యూత్ కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. అధ్యక్షునిగా కోరవేణి గిరిబాబు, ఉపాధ్యక్షుడుగా ప్రధాన కార్యదర్శి ఫట్టా నర్సయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు కిషన్ మల్లేశం, నర్సయ్య, సురేష్, రమణ, అనిల్, అజయ్, హరీష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

తంగళ్లపల్లి, జూలై 6: తంగళ్లపల్లి మండల కేంద్రంలో పోలీసులు శనివారం వాహనాల తనిఖీ, డ్రంకెన్‌డ్రైవ్ చేపట్టారు. ఆర్టీసీ డ్రైవర్లకు సైతం టెస్టులు నిర్వహించారు. పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఎస్సై సుధాకర్ పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహిస్తేనే గుర్తింపు

కోనరావుపేట, జూలై 6 : ప్రభుత్వ ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహిస్తేనే గుర్తింపు లభిస్తుందని హెచ్‌ఎం మంజుల దేవి అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు, హిందీ, పీఈటీ ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు విధిలో భాగమన్నారు. ఉద్యోగులు వారి కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహిస్తే గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎంసీ చైర్మన్ విజయ్, ఉపాధ్యాయులు కంటే మల్లయ్య, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

కోనరావుపేట, జూలై 7 : కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో కాంగ్రెస్ నాయకులు చేయూతనందించారు. పల్లిమక్త గ్రామానికి చెందిన సిర్రం లక్ష్మీ, అదే గ్రామానికి చెందిన మోకినపెల్లి చిన్నరామయ్య మృతి చెందగా పేదరికంలో ఉన్న ఆ కుటుంబాలకు తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కాంగ్రెస్ నాయకులు సిద్రవేణి ప్రభాకర్, మల్లేశం, ఆనందం, కిషన్, రాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థినులకు ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, జూలై 6: బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన ఎల్లారెడ్డి పేట మండలం వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు శ్రీనిధి, ఆస్మాబేగంను ఉపాధ్యాయులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం సన్మానిం చారు. కరీంనగర్‌లోని ఫార్మా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ దేవత వినయ్‌కుమార్ విద్యార్థినులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. హెచ్‌ఎం మాణిక్యం, ఉపాధ్యాయులు రాఘవేందర్‌రావు, కృష్ణహరి, శ్రీనివాస్, జగన్, రవి కుమార్, వెంకటరమణ, వేణుగోపాల్‌రావు, మనోహర్, రవి, బాబు, శ్రీనివాస్, ఉదయశ్రీ నాయకులు మహేశ్, పోచయ్య, ప్రభాకర్, విద్యాసాగర్, శ్రీను, శ్రీకాంత్, చరణ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సిమెంట్ బస్తాలు

ఇల్లంతకుంట, జూలై 6: మండలంలోని వల్లంపట్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మతల్లి ఆలయానికి కందికట్కూర్ మాజీ సర్పంచ్ ముత్యం అమర్‌గౌడ్ సిమెంట్ బస్తాలను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ నాయిని స్రవంతిర మేష్, నాయకులు బత్తిని శ్రీనివాస్, చెకిళ్ల లక్ష్మణ్, దొమ్మాటి మహేష్, బత్తిని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆధ్వర్యంలో

సామాజిక సేవా కార్యక్రమాలు

ఇల్లంతకుంట, జూలై 6: పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని ఏజీఎమ్ ఖలీద్‌షేక్ అన్నారు. మండ లంలోని అనంతగిరి గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయానికి శనివారం కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో బ్యాంకు దినదినం లావాదేవీలను పెంచుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఈవో మారుతిరావు, బ్రాంచ్ మేనేజర్ పూరుగొండ జితేందర్, శ్రీ కాంత్, సుమంత్, భూమయ్య, ప్రసాద్, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 6: సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్ మాట్లాడారు. ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా బాబు జగ్జీవన్‌రామ్ సేవలను వెలకట్టలేమని, ఆయన ఆశయ సాధన కోసం ప్రజలందరు పాటుపడాలని అన్నారు. ఆయన అడుగుజాడంలో రాహుల్‌గాంధీ నడుస్తూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, మాజీ డైరెక్టర్ నెరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ బైర ప్రభాకర్, మాజీ కౌన్సిలర్లు రాగుల జగన్, వెంగళ లక్ష్మినర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగిస్తామన్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, నాయకులు రాజన్న, రాఘవరెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, మాజీ కౌన్సిలర్ రాగుల జగన్, నాయకులు బాలరాజు, రాములు, తుంగ శివరాజు, ధర్మేందర్, లక్ష్మన్, కిష్టయ్య, దేవయ్య, హనుమంతు, కమలాకర్ శ్రీనివాస్ భూమయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్, కాంగ్రెస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు సుభాష్, నర్సింలు, పర్శరాములు, సందీప్, శివరామకృష్ణ, సుధాకర్‌రావు, కిషన్, తిరుపతినాయక్, మధు, దేవేందర్, కల్యాణ్, లక్ష్మారెడ్డి, గిరిధర్‌రెడ్డి, బాబు, రాములు, బుచ్చాగౌడ్, రాజునాయక్, రాంరెడ్డి, కిషన్, లక్ష్మీనారాయణ, గోపాల్, రఫీక్, రాజయ్య పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, నాయకులు ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

వేములవాడ రూరల్: మండలంలోని చెక్కపల్లిలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జగ్జీవన్ రామ్ కూతురు మీరా కుమారి సైతం వారి అడుగు జాడల్లో నడుస్తూ సమాజసేవలు అందించారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో మీరాకుమారి స్పీకర్‌గా ఉండి బిల్లు ఆమోదంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. నాయకులు రంగు వెంకటేశం, బొడ్డు రాములు, గోవర్దన్ రెడ్డి, సంఘ స్వామి, సోయినేని కరుణాకర్, సామ తిరుపతి రెడ్డి, దానె కొమురయ్య, అడ్డిక జైపాల్‌రెడ్డి, వంగపల్లి మల్లేశం, రొండి రాజు, మానుపాటి పర్శరాములు, చిలుక ప్రభాకర్ పాల్గొన్నారు.

● హన్మాజిపేటలో బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలోని మార్కండేయ స్వామి ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. పార్టీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, ఉపాధ్యక్షుడు జంకె మధు నాయకులు మల్యాల రాజు, గొల్లపల్లి వెంకటేష్, కావేరి రాజు, ఆడెపు విజయ్, కల్లెట్ల నరేష్, నారాయణ పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో జగ్జీవన్ రామ్ వర్ధంతిని శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నాయకులు కచ్చకాయల ఎల్లయ్య, చందనగిరి గోపాల్, లక్ష్మారెడ్డి, తాళ్లపెల్లి ప్రభాకర్, నందు గౌడ్, బాల్ రెడ్డి, బాలరాజు, ఉప్పుల గంగయ్య, మానుక సత్యం, లింగయ్య, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న చెన్నమనేని వికాస్



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, జూలై 6: రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసు కుందామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం 31 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామన్ మ్యాన్ నుంచి ఎమ్మెల్యేగా చేసింది ప్రజలేనని, వారికి పాలకుడిని కాదని సేవకుడిగా సేవలు అందిస్తున్నాని అన్నారు. వారం రోజులుగా కల్యాణ లక్ష్మి చెక్కులు వేములవాడ, చందుర్తి, కోనరావు పేట, మేడిపల్లి, బీమారం మండాలల్లో పంపిణీ చేశామని, రుద్రంగి మండలం చెక్కులు సిద్ధమ య్యాయని అధికారులు శుక్రవారం తెలప డంతో శనివారం పంపిణీ చేశామని అన్నారు. రెండు రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో ఒకరి ద్దరు కల్యాణలక్ష్మి చెక్కుల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించే వాతావరణం సృష్టించారన్నారు. అలాంటి పనులు చేయవద్దన్నారు. ఈ మండలం రెండు నియోజ కవర్గల్లో విభజించి ఉందని, మానాల గ్రామం బాల్కోండ నియోజకవర్గంలో ఉందని మానాలకు చెందిన చెక్కులు అక్కడి శాసనసభ్యులు చూసుకుంటారని వాటితో తమకు సంబంధం లేదని అన్నారు. తహసీల్దార్ శ్రీలత, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, చెలుకల తిరుపతి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కెసిరెడ్డి నర్సరెడ్డి, గండి నారాయణ, అభిలాష్, పల్లి గంగాదర్, ఇప్ప మహేష్, తర్రె లింగం, రవి, ద్యావల రవి, స్వర్గం పరంధామ్, సూర యాదయ్య, గంధం మనోజ్, దర్న మల్లేశం, ఆర్మూర్ నర్సయ్య, పడాల శ్రీనివాస్, పూదరి మహిపాల్, ఎర్రం అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సిగ్గు చేటు



నల్లబ్యాడ్జీలతో బీఆర్ఎస్వీ నాయకుల నిరసన

సిరిసిల్ల టౌన్, జూలై 6: బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టు సిగ్గు చేటని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. నిరుద్యోగ మార్చ్ టీజీపీఎస్సీ ముట్టడి నేపథ్యంలో ముందస్తు అరెస్టులను ఖండిస్తూ సిరిసిల్ల పట్టణం నేతన్న చౌక్ వద్ద బీఆర్ఎస్వీ నాయకులు నల్ల గుడ్డలతో చేతులను కట్టేసుకొని వినూత్న నిరసన తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ మార్చ్, టీజీపీఎస్సీ ముట్టడికి బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపునివ్వగా రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండి స్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జాబ్ క్యాలెండర్ విడదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని, గ్రూప్ వన్ మెయిన్స్ 1:100 పాటించాలన్నారు. విద్యార్థులు, నిరుద్యో గులకు బీఆర్ఎస్వీ అండగా ఉంటుందన్నారు. నాయకులు మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేష్, శ్రీనివాస్, రోహిత్, సాయి, మహ్మద్ రియాజ్, రవితేజ, అరవింద్, సందీప్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో శనివారం బీఆర్ఎస్వీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత అక్రమ అరెస్టులను ఖండిస్తూ కేజీ టు పీజీ సముదాయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నిరుద్యోగులను అడ్డంపెట్టుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులను పెంచాలన్నారు. బీఆర్ఎస్ యూత్ నాయకులు ఎడబోయిన రత్నాకర్, ఇరిగి సందీప్, బాలకృష్ణ, విద్యార్థి నాయకులు అక్షయ్, మణికాంత్, సాగర్, తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట : టీజీఎస్‌పీఎస్సీ ముట్టడి నేపథ్యంలో నిరు ద్యోగ యువతీయువకులను అక్రమ అరెస్ట్ చేయడంపై ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ నా యకులు శనివారం ఆందోళనకు దిగారు. స్థానిక పాత బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. శాంతియుతంగా ముట్టడి కార్యక్రమాన్ని చేపడితే అరెస్టులు చేయించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చై ర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు సుభాష్, నర్సింహారెడ్డి, దేవరాజు, పర్శరాములు, నర్సింలు, సుధాకర్ రావు, తిరుపతినాయక్, మధు, సీత్యానాయక్ పాల్గొన్నారు.

సబ్సిడీ విద్యుత్ అందేలా కృషి చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 6: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు గతం మాదిరిగా విద్యుత్ సబ్సిడీని అందేలా కృషి చేయాలని, సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. శనివారం కరీంనగర్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలతోపాటు 10 శాతం యారన్ సబ్సిడీ, గత ప్రభుత్వ బతుకమ్మ చీరల బకాయిలు రూ.276కోట్లు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చాడ వెంకటరెడ్డి ఉత్తరం రాయగా గురువారం 2022 సంబంధించిన కార్మికుల 10 శాతం యారన్ సబ్సిడీని విడదల చేశారన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను కుటీర పరిశ్రమగా మార్చి పవర్‌లూమ్స్‌కు 50 శాతం విద్యుత్ సబ్సిడీ అందేలా ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, మీసం లక్ష్మణ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సేవలను విస్మరించవద్దు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 6: అంగన్‌వాడీ ఉద్యో గుల సేవలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించ వద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమశాఖ కార్యాల యంలో శనివారం జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీరాజంను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సంద ర్భంగా రమణ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్‌లు, హెల్పర్‌లకు అత్యంత తక్కువ డబ్బులు చెల్లిం చాలని, జూలై 1 నుంచి ఇంటికి పంపించే నిర్ణ యాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించు కోవాలని అన్నారు. గత సంవత్సరం సమ్మె సంద ర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పదవీవిరమణ బెనిఫిట్స్ టీచర్‌లకు రూ.2లక్షలు, హెల్పర్‌లకు రూ.లక్ష చెల్లించడంతో పాటు వీఆర్ ఎస్ సౌకర్యాన్ని కల్పించి వేతనంలో సగం పెన్షన్ రూపంలో చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో 65 సంవ త్సరాలు పూర్తయిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్ప ర్‌లు జిల్లాలో 122 మంది పని చేస్తున్నారన్నారు. 60 ఏళ్ల పైబడిన అంగన్‌వాడీ ఉద్యోగులకు వీఆర్ఎస్ సదుపాయాన్ని కల్పించాలని, వేతనంలో సగం పెన్షన్ అందించాలని అన్నారు. 24 రోజులు సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీ లను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేద న్నారు. దీనిపై మంత్రితోపాటు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, స్పందన లేదని మండి పడ్డారు. పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్ప ర్‌ల మనోభావాలకు వ్యతిరేకంగా ఏకపక్షంగా అతి తక్కువ డబ్బులు చెల్లించి అంగన్‌వాడీ టీచర్‌లు, హెల్పర్‌లను జూలై 1 నుంచి ఇంటికి పంపించాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీ ఉద్యో గులకు నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వంతోపాటు మంత్రి సీతక్క వెంటనే స్పం దించాలని, అంగన్‌వాడీ ఉద్యో గులకు నష్టం కలిగించే జీవో నంబరు 10ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వ హించే ధర్నాకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్‌లు తరలిరావాలని కోరారు.

రోడ్డుకిరువైపులా.. చెట్ల తొలగింపు



చెట్ల తొలగింపును పరిశీలిస్తున్న ఎస్సై

చందుర్తి, జూలై 6: చందుర్తి మండలం మరిగడ్డలోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో బ్రిడ్జి, మూలమలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు, కొమ్మలు, ముళ్లకంపలను శనివారం చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు అడ్డంగా చెట్ల కొమ్మలు పెరగడంతో పలు సందర్భాల్లో వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఎస్సైని పలువురు ప్రశంసించారు.

వరల్డ్ జూనోసిస్ డే

రుద్రంగి, జూలై 6: రుద్రంగి మండల కేంద్రంలో వరల్డ్ జూనోసిస్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల పశువైద్యాధికారి శైలజను సన్మానించారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా పశువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల గురించి, అవి సోకకుండా తీసుకోవాల్సిన జగ్రత్తలను మండల పశువైద్యా ధికారి శైలజ వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆధ్యక్షులు హీరోజి, తిపిరెడ్డి వెంకటిరెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, కోమిరె శంకర్, పాఠశాల కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, ప్రిన్సిపాల్ హరినాథ్‌రాజు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ధర్మపురి, జూలై 6: ధర్మపురి లక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిత్రపటాలకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాదాపు 60 ఏళ్ల చరిత్ర కలిగిన కళాశాలను తిరిగి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ పద్మ-రవీందర్ పాల్గొన్నారు.

వెల్గటూర్: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామం చెగ్యాం నిర్వాసితులకు పరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, చెగ్యాం నిర్వాసితులు శనివారం వెల్గటూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. చెగ్యాం ముంపు గ్రామంలో 126 కుటుంబాల వారు ఇళ్ల పరిహారం కోసం పదే ళ్లుగా ఎదురుచూస్తున్నారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



సంకెపల్లిలో మొక్క నాటుతున్న వికాస్‌రావు

వేములవాడ టౌన్, జూలై 6: వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలో శనివారం డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు మాట్లాడుతూ అఖండ భారతావని కోసం ప్రాణాలర్పించిన గొప్ప వ్యక్తి జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. బీజేపీ మండల అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వర్‌రావు, శేఖర్, లింగంపల్లి శంకర్, ఎర్రం మధు, జింక శేఖర్, మోహన్‌రావు, సురేష్, రమేష్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

● వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ శనివారం మొక్కలు నాటారు. ఏక్ పేడ్ మాకే నామ్ అభియాన్ పథకంలో భాగంగా కళాశాలలో శనివారం మొక్కలు నాటినట్లు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట: జన సంఘ్ వ్యవస్థాకుడు శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతి సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లిలో బీజేపీ ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం మొక్కలను నాటారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేశ్, జవహర్‌లాల్, మురళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : యువత శ్యాం ప్రసాద్ ముఖర్జీ బాటలో నడవాలని నియోజకవర్గ బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్ రావు అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ నియోజకవర్గం నాయకులు డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు శనివారం మొక్కను నాటారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పొంచెట్టి రాకేష్, ప్రధాన కార్యదర్శులు చిర్రం తిరుపతి, చింతకుంట గంగాధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని రుద్రంగి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ పేరుతో చెన్నమనేని వికాస్‌రావు మొక్కలు నాటారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్, బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, పడాల గణేష్ పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు, జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు, బాలాజీ, మోహన్, గొట్టె రామచంద్రం, జవ్వాజి తిరుపతి గౌడ్, జింక వెంకటి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.